

రుద్రకోటేశ్వర క్షేత్రం



పర్యావరణ రుసుం వసూళ్లు చేసే బైర్లూటి చెక్‌పోస్టు

- అటవీ సంరక్షణ మరచి ఆదాయంపైనే దృష్టి
- పర్యావరణ రుసుం పేరిట భారీగా వసూళ్లు
- రుద్రకోడూరు క్షేత్రానికి వెళ్లాలన్నా ఆంక్షలే..



రుద్రకోడూరు బేస్‌క్యాంప్ వద్ద వాహనాలను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది (ఫైల్)

- శ్రీశైల పాదయాత్రికులను ఇబ్బందులకు గురి చేస్తున్న వైనం
- ఎకో టూరిజానికి లేని నిబంధనలు టెంపుల్ టూరిజానికి ఎందుకు..?
- అటవీ శాఖ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

ఇవేం వసూళ్లండి..!

ఆత్మకూరు, ఫిబ్రవరి 4:

ఆదాయమే పరమావధిగా అటవీశాఖ సాగిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అటవీ రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వదిలేసి పర్యావరణం పేరిట రుసుము వసూలు చేయడంపై వాహనదారుల నుంచి ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. ఆత్మకూరు-శ్రీశైలానికి రాకపోకలు సాగించే వారి నుంచి ముక్కుపిండి పర్యావరణ రుసుమును వసూలు చేస్తున్నారు. నాలుగు చోట్ల అటవీ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రతిరోజూ లక్షల రూపాయల ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ఇవి కాదని.. రుద్రకోటేశ్వర క్షేత్రానికి వెళ్లే భక్తుల నుంచి కూడా వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టారు. వాస్తవానికి నల్లమలలో అత్యంత ప్రాశస్త్యం కలిగిన రుద్రకోటేశ్వర క్షేత్రానికి భక్తులు ఎన్నో ఏళ్లుగా తరలి వెళ్తున్నారు. అయితే రెండు వారాల నుంచి అటవీ అధికారులు కొత్త నిబంధనలు విధించడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. అటవీ రక్షణపై దృష్టి సారించకుండా నిబంధనల పేరిట డబ్బు వసూళ్లకు పాల్పడటమేంటని ప్రశ్నిస్తున్నారు.

నల్లమలలోని రుద్రకోడూరు క్షేత్రానికి వెళ్లాలంటే ఫోర్‌వీలర్ వాహనానికి పర్యావరణ రుసుము కింద రూ.300 చెల్లించాల్సి ఉంది. అదే క్రమంలో టూ వీలర్‌గాని, నడిచి వెళ్లేందుకు గాని అనుమతించకూడదని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఈ నెల 29వ తేదీన కొంత శివస్వాములు సుదూర ప్రాంతాల నుంచి బైకులపై తరలివచ్చారు. అయితే వారిని అడ్డుకోవడమే కాకుండా రూ.200 ఇస్తే ప్రైవేట్ వాహనంలో తీసుకెళ్తామని అటవీ అధికారులు చెప్పడంతో శివస్వాములు మండిపడ్డారు. అటవీ అధికారుల తీరును నిరసిస్తూ ఆత్మకూరు-నంద్యాల రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. చివరకు అటవీ అధికారులు దిగివచ్చి శివస్వాములు రుద్రకోడూరుకు వెళ్లేందుకు అనుమతించారు. అసలు రూ.300 ఎందుకు వసూళ్లు చేస్తున్నారని వాహనాల్లో వచ్చే భక్తులు మండిపడుతున్నారు.



రుద్రకోడూరుకు రాకపోకలు సాగిస్తున్న వాహనాలు(ఫైల్)

అప్పుడు లేని నిబంధనలు టెంపుల్ టూరిజానికి ఎందుకు..?

పర్యావరణాన్ని పర్యాటకుల చెంతకు తీసుకురావాలన్న ఉద్దేశంతో ఎకో టూరిజాన్ని అటవీ శాఖ ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం పలు అటవీ ప్రాంతాల్లో ఎకో టూరిజం కేంద్రాలను ఏర్పాటు చేసి విడిది సదుపాయంతోపాటు అడవిలో పర్యటించేందుకు వీలుగా జంగిల్ సఫారీని పర్యాటకులకు అందుబాటులో ఉంచారు. ఈసేవలకు భారీగా డబ్బు వసూళ్లు చేస్తున్నారు. అసలు ఎకో టూరిజం కింద జంగిల్ సఫారీ పేరిట అడవిలో వాహనాలు సంచరిస్తే వన్యప్రాణులకు విఘాతం తలెత్తదా అన్నది అటవీ అధికారులకే తెలియాలి. కేవలం టెంపుల్ టూరిజానికి అటవీ అధికారులు ఆంక్షలు విధిస్తూ.. ఎకోటూరిజం పేరిట భారీ ఆదాయానికి పూనుకోవడం చూస్తే అటవీ రక్షణ పట్ల వారి చిత్తశుద్ధి ఏంటో అర్థం చేసుకోవచ్చు. అడవిలోని ఆలయాలకు వచ్చే భక్తులకు తగిన జాగ్రత్తలు, నిబంధనలు తెలియపరిస్తే బాగుంటుందే తప్ప డబ్బు వసూలు చేయాలన్న ఆలోచనలను అటవీ శాఖ విరమించుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



రుసుము వసూలు అన్యాయం

నల్లమలలోని రుద్రకోటేశ్వర క్షేత్రానికి వెళ్లే భక్తులకు అటవీ శాఖ ఎటువంటి రుసుము వసూలు చేయరాదు. ఒక్కో వాహనం నుంచి రూ.300 చెల్లించాలంటే భక్తులకు ఆర్థిక భారమే. ఆలయ ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రపరుస్తూనే ఉంటాము. అటవీశాఖ నిర్ణయించిన రోజుల్లో మాత్రమే భక్తులు క్షేత్రానికి వస్తున్నారు. ఆసమయంలో భక్తులను ఏనాడు వన్యప్రాణులు అపాయం కలిగించిన సందర్భాలు లేదు. ఈ విషయాన్ని అటవీ అధికారులు గుర్తించాలి.

- రాఘవరావు, రుద్రకోటేశ్వర స్వామి ఆలయ నిర్వాహకుడు, వెలుగోడు

శ్రీశైల పాదయాత్రికులకు తప్పని అవస్థలు

అటవీ చట్టాల పేరుతో ఆశాఖ అధికారులు ప్రవేశపెడుతున్న నిబంధనలతో శ్రీశైల పాదయాత్రికులకు అవస్థలు తప్పడం లేదు. ఎన్నో వందల ఏళ్ల నుంచి శ్రీశైలానికి కాలినడకన భక్తులు తరలి వెళ్తుంటారు. ఆ సంప్రదాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా అనేక సందర్భాల్లో శ్రీశైల పాదయాత్రికులను అటవీ అధికారులు అడ్డుకోవడం విమర్శలకు తావిస్తోంది. అంతేగాకుండా అటవీ ప్రాంతాల్లో నిర్వహించే అన్నదాన కేంద్రాల నిర్వాహకులకు కూడా ఆంక్షల పేరిట ఇబ్బందులకు గురిచేసిన సంఘటనలు ఉన్నాయి. అడవుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలే తప్ప భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అటవీ నిబంధనల పేరిట ఆంక్షలు


నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ పరిధిలో రుద్రకోటేశ్వర క్షేత్రం ఉంది. ఈక్షేత్రానికి ముఖ్యమైన పర్వదినాలు, కార్తీక, మాఘ మాసాలతోపాటు సాధారణ రోజుల్లో ఆది, సోమవారాల్లో వెళ్లేందుకు మాత్రమే అటవీ అధికారులు అనుమతించేవారు. ఇప్పటి వరకు క్షేత్రానికి వెళ్లే భక్తులకు వన్యప్రాణుల నుంచి ఎటువంటి అపాయం తలెత్తలేదు. అదే క్రమంలో రుద్రకోటేశ్వర క్షేత్ర నిర్వాహకులు కూడా పర్యావరణ నిబంధనలను అనురిసస్తూ ముందుకెళ్తున్నారు. అయినప్పటికీ ఆంక్షల పేరిట అటవీ అధికారులు వేధించడం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. నల్లమలను ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా ప్రకటించడం, వన్యప్రాణుల సంరక్షణ కోసమే తాము కఠినంగా నిబంధనలు అమలు చేస్తున్నామని అటవీ అధికారులు చెబుతున్నప్పటికీ ఆదాయ మార్గాలపై దృష్టి సారించడం విమర్శలకు తావిస్తోంది. వన్యప్రాణులకు, అడవికి విఘాతం కలిగించకుండా ఉండేందుకు భక్తులకు అవగాహన కల్పించాలే తప్ప డబ్బు వసూళ్లు వసూళ్లు చేయడం ఏంటన్న ప్రశ్న తలెత్తుతోంది.



అటవీ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న శివస్వాములు

పర్యావరణ రుసుమును సక్రమంగా వినియోగిస్తున్నారా..?

ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి వెళ్లాలంటే మార్గమధ్యలో బైర్లూటి, కొర్రప్రోలు, శిఖరం, దోర్నాల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అటవీ శాఖ పర్యావరణ రుసుము వసూళ్లు చేస్తోంది. ఒక్కో చెక్‌పోస్టు వద్ద ప్రతి రోజూ రూ.30 వేల నుంచి రూ.లక్షకు పైగా ఆదాయం సమకూరుతోంది. ఇవి కావని అటవీ మార్గంలో 30 కిమీలకు వేగంగా వెళ్లినా, వాహనాలు నిలిపినా, కోతులకు ఆహారం అందించినా రుసుమును వసూలు చేస్తున్నారు. అయితే ఈవిధంగా వచ్చిన సొమ్మును కేవలం ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి వెళ్లే రహదారిలో వన్యప్రాణులకు విఘాతం కలకుండా ఉండే చర్యలు మాత్రమే జరుగుతున్నాయా..? అన్నది ప్రశ్నార్థకమే. ఆ మార్గంలో పర్యావరణ రుసుము పేరుతో వచ్చే ఆదాయాన్ని ఆ డివిజన్ పరిధిలోని నల్లమల అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే రుద్రకోడూరు క్షేత్ర పరిధిలో అడవులను, వన్యప్రాణులను సంరక్షించాల్సి ఉంది. అయితే వాటితో సంబంధం లేకుండా రుద్రకోడూరుకు వెళ్లే భక్తుల నుంచి ప్రత్యేకంగా రూ.300 వసూళ్లు చేయడం ఏమిటని భక్తులు మండిపడుతున్నారు.



భక్తులపై ఆర్థిక భారం సరికాదు

ఇప్పటికే పర్యావరణ రుసుము పేరిట అనేక చోట్ల ఫారెస్టు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి డబ్బు వసూలు చేస్తున్నారు. ఇది చాలదని రుద్రకోడూరు క్షేత్రానికి వెళ్లే భక్తుల నుంచి డబ్బు వసూలు చేయాలని నిర్ణయించడం సరికాదు. ఎక్కడో అటవీ ప్రాంతంలో ఉండే ఆలయాలను సందర్శించేందుకు భక్తులకు వ్యయప్రయాసలు తప్పడం లేదు. ఇది కావని అటవీశాఖ కొత్తగా రుసుములను తీసుకురావడం భక్తుల మనోభావాలను కించపరచడమే. ఇప్పటికైనా అటవీ అధికారులు వసూలు నిర్ణయాన్ని విరమించుకోవాలి.

- గరుడాద్రి సుదర్శన్, వీహెచ్‌పీ అధ్యక్షులు, ఆత్మకూరు ప్రఖండ

జగన్‌ను ఇంటికి పంపేందుకు జనం సిద్ధం

మాజీ ఎమ్మెల్యే బీసీ




పలుకూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 4! సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండ లంలోని పలుకూరు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బీసీకి మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, టీడీపీ యువ నాయకుడు గుండం మల్లికార్జునరెడ్డి, వల్లెపు శంకర్, చల్లా మద్దిలేటి తదితర టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భం గా బీసీ మాట్లాడుతూ సైకో సీఎం గడచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో భ్రష్టు పట్టించారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఆదాయం పెరగలేదని మండిపడ్డారు. ఈ రెండు నెలలపాటు రాష్ట్ర ప్రజలు కలిసికట్టుగా పని చేసి ఈ అసమర్థ సీఎంను ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రవేశపెట్టబోయే సూపర్ సిక్స్ పథకాల గురించి బీసీ ఇంటింటి ప్రచారం చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ శివ, చల్లా రమణ, నాగమయ్య, చాకలిపెద్ద హుసేని, ఆనంద్, సుబ్బరాయుడు, కస్తూరి కుక్కలయ్య తదితరులు పాల్గొన్నారు.

మరబోటు తిప్పేందుకు అనుమతి

కొత్తపల్లి, ఫిబ్రవరి 4: కృష్ణా నదిలో సంగమేశ్వరం నుంచి సోమశిలకు వెళ్లేందుకు ఎట్టకేలకు అనుమతులు లభించాయి. దీంతో సోమవారం నుంచి కొత్తపల్లి మండలంలోని సప్తనదుల సంగమేశ్వరం నుంచి సోమశిల వరకు మరబోటు తిప్పేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఆదివారం బోటు నిర్వాహకులు మునగాల కృష్ణయ్య, రేవుల జగపతిరావు విలేకరులతో మాట్లాడారు. కాకినాడ సమీపంలోని యానంలో సుమారు రూ.15 లక్షలు వెచ్చించి అన్ని హంగులతో మరబోట్లను తయారు చేయించినట్లు తెలిపారు. వీటికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మచిలీపట్నం పోర్టు అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకున్నట్లు తెలిపారు. 24 మంది సామర్థ్యం గల ఈ బోటులో 9 ఎయిర్‌గన్స్, ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు ఉంటాయని తెలిపారు.



కృష్ణానదిలో తిప్పేందుకు సిద్ధమైన మరబోట్లు

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్లక్ష్యం

- మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి
- పుసులూరులో టీడీపీ ఆత్మీయ సమావేశం

కల్లూరు, ఫిబ్రవరి 4: ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్టుల నిర్మాణంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు మండలం పుసులూరు పల్లె ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన టీడీపీ ఆత్మీయ సమావేశానికి మాండ్ర శివానందరెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, టీజీ భరత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పల్లె ప్రభాకర్‌రెడ్డి నివాసం నుంచి దాదాపు ఐదు వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించి గౌరు దంపతుల సమక్షంలో టీడీపీ జెండా ఆవిష్కరించారు. ఆత్మీయ సమావేశానికి టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై అభిమాన నాయకులపై పూలవర్షం కురిపించారు. పాణ్యం నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. పుసులూరు, లొద్దిపల్లె, రేమడూరు, యాపర్లపాడు, బొల్లవరం, పెద్దపాడు నుంచి డిప్యూటీ మేయర్ ముఖ్య అనుచరుడు మల్లికార్జునతోపాటు దాదాపు 50 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కోట్ల, గౌరు, బీసీ, మాండ్ర టీడీపీ కండువాలు వేసి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి కోట్ల మాట్లాడుతూ జిల్లాలో జగన్ ప్రాజెక్టులను గాలికొదిలేశారని నీటిని స్టోరేజీ చేసుకునే అవకాశం లేకుండా పోయిందని ఆరోపించారు. తుంగభద్ర, హంద్రీనదిలో ఇసుకను వైసీపీ నేతలు అక్రమంగా తరలిస్తున్నారని విమర్శించారు. దీంతో సాగు నీరందక పంటలు ఎండిపోయి రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బనగానపల్లె టీడీపీ ఇన్‌చార్జి బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 65 రోజుల్లో ఎన్నికలు వస్తున్నాయని వైసీపీ ఓడించేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ టీడీపీలోకి వలసలు చూసి అధికార పార్టీలో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. పాణ్యం ఎమ్మెల్యే అనుచరవర్గం పేదలు, అమాయకుల పొలాలు, స్థలాలు కబ్జా చేస్తోందని విమర్శించారు. పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత మాట్లాడుతూ జగన్ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. టీడీపీ అధినేత ప్రవేశ పెట్టిన ఆరు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత సుబ్బారెడ్డి మాట్లాడుతూ జగన్ అందరినీ వాడుకుని వదిలేసే రకం అన్నారు. కార్యక్రమంలో కె.పార్వతమ్మ, పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, చంద్రకళాధర్‌రెడ్డి, పద్మలతారెడ్డి, పాలకొలను సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, డి.రామాంజనేయులు, ఈవీ రమణ, జనసేన నాయకుడు చింతా సురేష్, కాసాని మహేష్‌గౌడ్, వాకిటి మాదేష్ టీడీపీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్రమాజీ మంత్రి కోట్ల

క్వింటం ఎండు మిరప రూ.22 వేలు

వారంలో రూ.3 వేలు తగ్గిన ధర

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 4: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం ఎండుమిరప ధర బ్యాడిగి రకం క్వింటాలు గరిష్ఠంగా రూ.22 వేలు పలికింది. గత వారంతో పోల్చితే క్వింటానికి రూ.3వేలకు పైగా ధర తగ్గింది. తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాల వల్ల ఈ ఏడాది మిరప పంట దిగుబడి గణనీయంగా తగ్గిందని, ధర కూడా తగ్గడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తేజా రకం ఎండు మిరప ధర క్వింటాలు గరిష్ఠంగా రూ.19,311, లాలి లాలి రకం మిరప రూ.14,511, డీడీ రకం రూ.15,011, సూపర్ 10 రకం మిరప రూ.17,550 పలికింది. ఆదివారం మొత్తం 2103 బస్తాల ఎండు మిరపను రైతులు విక్రయానికి తీసుకోరాగా, వాటి కనిష్ఠ ధర క్వింటాలు రూ.4,611, గరిష్ఠ ధర రూ.22వేలు మధ్యస్థ ధర రూ.15,300 పలికింది.



అక్రమ కట్టడాల జోరు

- ప్లాను లేకుండానే నిర్మాణాలు
- పుర ఆదాయానికి రూ.కోట్లలో గండి


మట్కార్ వీధిలోని ఇరుకు సందు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 4 : ఇరుకు సందుల్లోని ఇళ్ల నిర్మాణాల ప్లాను మంజూరుకు నిబంధనలు అడ్డంకిగా మారాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్లాను మంజూరు లేకుండానే నిర్మాణాలు జరుగుతున్నాయి. ఫలితంగా రూ.కోట్లలో మున్సిపాలిటీల ఆదాయానికి గండి పడుతోంది. ఇరుకు సందులలో ప్లానుల మంజూరుకు ప్రభుత్వం వెసులుబాటును కల్పించినా ఆ దిశగా పుర అధికారులు చర్యలు తీసుకవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీవో నెం. 119 ప్రకారం 30 అడుగుల రోడ్డు ఉంటేనే ప్లాను మంజురుకు అవకాశం ఉంటుంది. పాత పట్టణ ప్రాంతాల్లో ఐదు నుంచి పది అడుగుల వెడల్పుతో చిన్నపాటి సందులే అధికంగా ఉండడంతో ఈ జీవో ప్రకారం ప్లాన్ మంజూరుకు అవకాశం లేదు. ఒకవేళ ప్లాను మంజూరు చేసుకోవాలంటే నిర్మాణదారుడు మునిసిపాలిటీకి అవసరమైన స్థలం సొంత ఖర్చులతో రిజిస్టర్ చేసి ఇవ్వాల్సి ఉంటుంది. పాత పట్టణ ప్రాంతాల్లో చిన్నపాటి స్థలాలు ఉండటం, అందులో పేద కుటుంబాలే అధికంగా నివసిస్తుండడంతో రహదారి విస్తరణ కోసం తమ స్థలాన్ని మున్సిపాలిటీలకు ఉచితంగా ఇవ్వడానికి నిర్మాణదారులు ఇష్టపడటం లేదు. స్థానిక చోటా నాయకుల సహకారంతోనో, సచివాలయ వార్డు ప్లానర్లకు లంచాలు ముట్టజెప్పడంతోనో ప్లాను మంజూరు లేకుండానే అక్రమ నిర్మాణాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

హౌసింగ్ రుణాలు అభించని పరిస్థితి

ఇరుకు సందులలో ప్లాను మంజూరుకు అవకాశం లేకపోవడంతో బ్యాంకులలో హౌసింగ్ రుణాలు లభించే పరిస్థితి లేకుండా పోతోంది. బ్యాంకు రుణాల కోసం అర్హత ఉండి, ప్లాను అభించని కారణంగా, అప్పులు చేసి అక్రమ నిర్మాణాలను చేసుకోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.


ఇరుకు సందులో జరుగుతున్న అనధికార కట్టడం

పుర ఆదాయానికి రూ.కోట్లలో గండి

జిల్లాలోని మున్సిపాలిటీలలో గతంతో పోలిస్తే ప్లానుల మంజూరు సంఖ్య దాదాపు 80 శాతం తగ్గిపోవడంతో రూ.కోట్లలో పుర ఆదాయానికి గండి పడినట్లు తెలుస్తోంది. 2023 కర్నూల్ కార్పొరేషన్‌లో 1591, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో 480, ఆదోని మున్సిపాలిటీలో 280 ప్లానులు మాత్రమే మంజూరయ్యాయి. గతంలో మంజూరైన ప్లానులతో పోలిస్తే జిల్లాలోని మున్సిపాలిటీలకు రూ.75 నుంచి రూ.80 కోట్ల దాకా ఆదాయానికి గండి పడినట్లు తెలుస్తోంది.

పూర్తి కాని సర్క్యులేషన్ ప్యాటర్న్...

పాత పట్టణాలలో ప్లానుల సంఖ్య పూర్తిగా తగ్గిపోవడం గమనించిన ప్రభుత్వం చిన్నపాటి సందులలో కూడా సులభంగా ప్లానుల మంజూరు కోసం ఒక వెసులుబాటును ప్రకటించింది. ఇరుకుగా ఉండే రోడ్డుకు సంబంధించిన ప్లాన్లను (సర్క్యులేషన్ ప్యాటర్న్) రూపొందించి స్థానిక మునిసిపల్ కౌన్సిల్ అనుమతితో ప్రభుత్వానికి పంపిస్తే ఆయా ప్రాంతాల్లో ప్లాన్ మంజూరుకు ప్రత్యేక జీవో ఇచ్చే అవకాశం ప్రభుత్వం కల్పించింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో ఏ ఒక్క మునిసిపాలిటీలో కూడా ఇంతవరకు ఒక్క సర్క్యులేషన్ ప్యాటర్న్ ప్లాన్ కూడా మంజూరుకు నోచుకోలేదు. ఫలితంగా ఇరుకు సందులలో అక్రమ నిర్మాణాలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి వార్డుకు ఒక సచివాలయం, తగిన సిబ్బంది ఉన్నా వాటిని రూపొందించి ప్రభుత్వానికి పంపడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.

త్వరలోనే మంజూరయ్యే అవకాశం ఉంది

పాత పట్టణ పరిధిలోని 10 ఇరుకు సందులకు సంబంధించి సర్క్యులేషన్ ప్యాటర్న్ ప్లాన్‌ను ఆర్డీటీకి పంపాం. త్వరలో మంజూరయ్యే అవకాశం ఉంది. మిగిలిన అన్ని ఇరుకు సందులకు సంబంధించి సర్క్యులేషన్ ప్యాటర్న్ ప్లానును కూడా పంపించనున్నాం. ప్లాను లేకుండా జరిగే నిర్మాణాలకు నోటీసులు జారీ చేస్తున్నాం.

-శ్రీనివాసులు, అసిస్టెంట్ సిటీ ప్లానర్, ఆదోని

శ్రీకాకుళంకు మాత్రమే ప్రత్యేక జీవో

రాష్ట్రంలో ఒక్క శ్రీకాకుళం పట్టణంలోని పాత ఒన్టీలో ఉన్న 30 ఇరుకు ప్రాంతాలకు సంబంధించి సర్క్యులేషన్ ప్యాటర్న్ ప్లాన్లు రూపొందించగా అందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కర్నూలు జిల్లాలో ఏ మున్సిపాలిటీలో కూడా ఒక్క సర్క్యులేషన్ ప్యాటర్న్ ప్లాన్లు రూపొందించి ప్రభుత్వ అనుమతి పొందిన దాఖలాలు లేవు. జిల్లాలోని మున్సిపాలిటీలలో ఉన్న ఇరుకు సందులకు సంబంధించిన సర్క్యులేషన్ ప్యాటర్న్ ప్లానులను రూపొందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు


శ్రీమఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, ఫిబ్రవరి 4. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. రథోత్సవాలలో భక్తులు పాల్గొని ఆశీస్సులు పొందారు.

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు

ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం మాఘమాసం పర్వ దినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నవరత్నాల రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలును ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ చేశారు.

రాఘవేంద్రుని సన్నిధిలో సినీ నటుడు

మంత్రాలయం, ఫిబ్రవరి 4: మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం ప్రముఖ సినీ నటుడు మధుసూదన్, సినీ నిర్మాత బాలాజీ బృందం ఆదివారం మంత్రాలయం వచ్చారు. వీరికి మఠం అధికారులు స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో గోరుకల్లు కృష్ణ, వ్యాసరాజాచార్, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రాలయంలో సినీ నటుడు మధుసూదన్, నిర్మాత బాలాజీ

23 సార్లు రక్తదానం


23వ సారి రక్తదానం చేస్తున్న ఉప్పలపాటి అర్జున్

కోసిగి, ఫిబ్రవరి 4: ఒకటి కాదు.. రెండు కాదు.. 23 సార్లు అవసరమైన వారి దగ్గరికి పరుగెత్తుకుంటూ వెళ్లి ఉప్పలపాటి అర్జున్ రక్తదానం చేస్తున్నాడు. మండల పరిధిలోని కోల్‌మాన్‌పేట గ్రామానికి చెందిన అర్జున్ ఇప్పటి వరకు గర్భిణులకు, బాలింతలకు, ప్రమాదాల్లో గాయపడిన వారికి 23 సార్లు రక్తదానం చేశాడు. ఆదివారం కూడా అదే గ్రామానికి చెందిన చాగి హారిక అనే 9 నెలల గర్భిణికి కాన్పు సమయంలో రక్తం తక్కువగా ఉందని 23వ సారి రక్తదానం చేసి శభాష్ అనిపించుకున్నాడు.

రూ.13 లక్షల నగదు పట్టివేత


పట్టు బడ్డ నగదును చూపుతున్న ఎస్సై, తహసీల్దార్

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 4 : బ్రాహ్మణకొట్కూరు వద్ద గల అంతర్ జిల్లా చెక్ పోస్టు వద్ద రూ.13 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై నాగార్జున తెలిపారు. ఆదివారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్టు వద్ద బ్రాహ్మణకొట్కూరు ఎస్సై నాగార్జున సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. డోన్‌కు చెందిన శ్రీనివాస్ గౌడు అనే వ్యక్తి వద్ద రూ.13 లక్షల నగదు లభ్యమైంది. వాటికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా తన కారులో తీసుకుని పోతుండగా సీజ్ చేసినట్లు తెలిపారు. ఇన్‌కమ్ టాక్స్ డిపార్టుమెంట్‌కు పంపించామన్నారు. నందికొట్కూరు డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరిదేవి, బ్రాహ్మణకొట్కూరు ఎస్సై నాగార్జున, సిబ్బంది వీఆర్వోలు పాల్గొన్నారు.

టీడీపీ యువ నాయకుడి మృతి

క్రిష్ణగిరి, పిబ్రవరి 4: తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, కంబాలపాడు గ్రామానికి చెందిన లాలప్ప (38) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. తెలుగు యువత నాయకుడు కేఈ వేణుబాబు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి లాలప్ప ఎంతగానో కృషి చేసాడని, వారి కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు.


లాలప్ప(ఫైల్)

'రైతులంతా ఏకం కావాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 4: రైతులంతా ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. ఆదివారం రాజోలి గ్రామ సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మండపంలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు అందిస్తే మంచిదని అన్నారు. సాగునీటి జలాలు ఉన్న వాటిని ఒడిసి పట్టేందుకు ఈ ప్రాంత రైతాంగానికి కావాల్సిన రిజర్వాయర్లను నిర్మించలేదని అన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు ఎన్నో మార్గాలు ఉన్నా వాటిని అన్వేషించడం లేదని అన్నారు. పూడుకపోయిన కాలువలను బాగు చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. కుందూ నది వెడల్పు చేస్తూ కట్టలు వేయడం వల్ల పరివాహక రైతులకు ఇబ్బందులు తలత్తే అవకాశాలు ఉన్నాయని అన్నారు. వర్షాలు వస్తే ఆ నీరు ఎక్కడకు మళ్లించాలని ప్రశ్నించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రైతులంతా ఐకమత్యమై తమ సమస్యలను పరిష్కరించేందుకు పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి సహదేవరెడ్డి, రాయలసీమ కార్మికుల సాధన సమితి అధ్యక్షుడు వెన్నపూస సుబ్బిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, వైఎస్ రెడ్డి, మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.


రాయలసీమ రక్ష పుస్తకావిష్కరణ చేస్తున్న బొజ్జా దశరథ రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

అనుమతి లేకుండానే రోడ్డును తవ్వేసిన వలంటీరు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 4: పట్టణంలోని రెండో వార్డు బావాజీపేటలో మురికి నీటిపైపు ఏర్పాటు కోసం సిమెంట్ రోడ్డు మధ్యలో అడ్డంగా తవ్వేయడంపట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలనే వేసిన సిమెంట్ రోడ్డును అధికారుల అనుమతి లేకుండా సచివాలయ వలంటీర్ తవ్వేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికార పక్ష నాయకులే కాకుండా వలంటీర్లు కూడా తమ ఇష్టానుసారం ప్రవర్తిస్తుండటం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానికుల ఫిర్యాదులతో పురపాలక డీఈ నాగభూషణం రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డు తవ్వకాల పనిని ఆపుచేయించారు. అయినా అధికారులు వెళ్లిన వెంటనే తిరిగి తవ్వకాల పనులు తిరిగి చేపట్టారు. ప్రజలకు ఉపయోగపడే రోడ్డును ఎమ్మెల్యే పేరును వాడుకుంటూ అడ్డంగా తవ్వేయడం పట్ల తెలుగుదేశం పార్టీ మాజీ కౌన్సిలర్, పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రచార కార్యదర్శి బోయ తిమ్మప్ప తీవ్రంగా విమర్శించారు.


అడ్డంగా తవ్వేసిన రోడ్డు

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ఆలూరు, ఫిబ్రవరి 4: ఆలూరు మండలం హోలేబీడు గ్రామ శివారులో ఆదివారం మొయినుద్దీన్, గణేష్ అనే ఇద్దరు బాలురు సైకిల్‌పై బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా బళ్ళారి నుంచి రాయచూరు వైపు వెళ్తున్న కేఏ35డీ3147 నెంబరు గల కారు అతి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. మొయినుద్దీన్ (13) అనే బాలుడి పరిస్థితి విషమంగా మారింది. ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గణేష్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. కారును, డ్రైవర్‌ను గ్రామస్థులు పోలీసులకు అప్పజెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కలశ యాత్రను ప్రారంభించిన టీజీ భరత్


కలశ యాత్రను ప్రారంభిస్తున్న టీజీ భరత్

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 4: పాత నగరంలోని చిన్న అమ్మవారిశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి కలశ యాత్రను ఆదివారం పాత నగరంలోని శ్రీ రాంబొట్ల దేవాలయం వద్ద టీడీపీ కర్నూలు నియోజిక వర్గం ఇన్‌చార్జి టీజీ భరత్ ప్రారంభించారు. అంతకు ముందు రాంబొట్ల దేవాలయంలో పూజలు చేశారు.

నేడు డీఐజీ బాధ్యతల స్వీకారం

కర్నూలు, ఫిబ్రవరి 4: కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరాం సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కాకినాడు ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తున్న ఆయన ఇటీవలె కర్నూలు రేంజ్ డీఐజీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం కర్నూలు బీ. క్యాంపులోని పోలీసు అతిథి గృహానికి చేరుకున్నారు. కర్నూలు వచ్చిన ఈయనకు ఎస్పీ జి కృష్ణకాంత్, అడిషనల్ ఎస్పీ నాగరాజు, డీఎస్పీ విజయశేఖర్, సీఐలు నాగరాజు యాదవ్, మురళీధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం ఉన్న డీఐజీ సెంథిల్ కుమార్ ఆక్టోపస్ డీఐజీగా బదిలీ అయిన విషయం తెలిసిందే..


డీఐజీకి బొకే ఇస్తున్న ఎస్పీ

అంబేడ్కర్ విగ్రహం వద్ద మౌన ప్రదర్శన


మౌన ప్రదర్శన చేస్తున్న రాష్ట్ర నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 4: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పాత బస్టాండులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు మౌన ప్రదర్శన చేశారు. అంతకు ముందు జడ్పీలోని ఎంపీపీ సమావేశ హాలులో సంఘం జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత డీఎస్పీ డి. మహబూబ్ బాషా ఆధ్వర్యంలో నూర్‌బాషా కులస్థులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మొహమ్మద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే చట్ట సభల ఎన్నికల్లో నూర్‌బాషా, దూదేకుల కులం వారికి రాష్ట్రంలో ఐదు ఎమ్మెల్యే సీట్లు, రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తమకు సీట్లు కేటాయించే పార్టీకే తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వరకు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అక్కడ మౌన నిరసన పాటించారు. ఈ కార్యక్రమంలో నూర్‌బాషా, దూదేకుల ముస్లి సంక్షేమ సంఘం ఉద్యోగ సంఘ నాయకుడు సిద్ధయ్య, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మస్తాన్ పాల్గొన్నారు.

లారీలు ఢీకొని డ్రైవర్ మృతి

బనగానపల్లె, ఫిబ్రవరి 4: మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామ సమీపంలో వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ శ్రీనివాసులు (46) మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. పులివెందులకు చెందిన శ్రీనివాసులు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. లారీ ట్యాంకర్‌తో బనగానపల్లె వైపు వెళ్తూ వెనుక నుంచి వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లారీ నుజ్జునుజ్జయి డ్రైవర్ శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

వ్యక్తి అరెస్టు.. బైక్ సీజ్

మంత్రాలయం, ఫిబ్రవరి 4: మంత్రాలయం మండలంలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద కర్ణాటక నుంచి 480 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తెస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన కట్టుబడి మైనుద్దీన్ మోటారు సైకిల్‌పై 5 బాక్సుల్లో 90 ఎంఎల్ ఒరిజినల్ చాయిస్ విస్కీ 450 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా.. మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు అరెస్టు చేశారు. మద్యంతో పాటు బైక్‌ను సీజ్ చేసి కోర్టులో హాజరు పరచారు. ఆయనను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రెండు ఇళ్లలో దొంగతనం

సి. బెళగల్, ఫిబ్రవరి 4: మండలంలోని కంబదహాల్ గ్రామంలో శనివారం అర్థరాత్రి వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి ఇండ్లలో దొంగతనాలు జరిగాయి. ఆ ఇండ్లలోని కుటుంబ సభ్యులు బంధువుల ఊరికి వెళ్లడం గమనించి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. ఆ రెండు ఇళ్ల వారు ఆదివారం ఇంటికి వచ్చాక నగదు, బంగారం పోయినట్లు గుర్తించారు. వెంకటరామిరెడ్డి ఇంట్లో రూ.లక్ష, ఐదు తులాల బంగారం, ప్రతాప్‌రెడ్డి ఇంట్లో రూ.50 వేల నగదు, ఒకటిన్నర తులం బంగారం చోరీ జరిగింది. బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విష ఆహారం తిని శునకాల మృతి

కొత్తపల్లి, ఫిబ్రవరి 4: కొత్తపల్లి మండలం జడ్‌వారిపల్లెలో సుమారు 40 శునకాలు మృతి చెందాయి. గ్రామంలోని గొర్రెలను కుక్కలు వెంటాడి చంపి తింటున్నట్లు గ్రామస్థులు చెప్పారు. దీంతో గ్రామంలోని కొందరు వ్యక్తులు చనిపోయిన గొర్రెల కళేబరంలో విషం కలిపారని, దీంతో ఆ మాంసం తిన్న కుక్కలు మరణించినట్లు తెలిపారు

టీడీపీతోనే బీసీలకు న్యాయం: బుడ్డా

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 4: టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బండిఆత్మకూరులో ఆదివారం రాత్రి 'జయహో బీసీ' సభ నిర్వహించారు. బుడ్డా మాట్లాడుతూ జగన్ అరాచక పాలనతో అన్ని వర్గాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. శ్రీశైలం నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే శిల్పా ఏమి అభివృద్ధి చేశారో బహిరంగ చర్చకు రావాలని ఎన్నోమార్లు సవాల్ విసిరినా సమాధానం లేదన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించి అధికారంలోకి రావటం ఖాయమని, మళ్ళీ చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. బీసీ నాయకులు తిరుపాల్, శ్రీరాములు, శివప్రసాద్, రామకృష్ణ, నాగన్నలు టీడీపీ హయాంలో బీసీల సంక్షేమం, ప్రాధాన్యతల గురించి వివరించారు. మండలంలోని బీసీ సర్పంచ్‌లు రామచంద్రుడు, పెద్దన్న, రామసుబ్బయ్యను బుడ్డా సత్కరించారు. టీడీపీ నాయకులు నందిపాటి నరసింహారెడ్డి, కంచర్ల సురేష్‌రెడ్డి, మనోహర్‌చౌదరి, తాటికొండ బుగ్గరాముడు, సుబ్బారెడ్డి, డాక్టర్ భరద్వాజశర్మ, చిన్నలింగారెడ్డి, బాలుడు, వీ శ్రీనివాసులు, చెన్నారెడ్డి, లక్ష్మయ్య, కె.శంకర్, బాబు, సిద్ధయ్య, జాకీర్, మహేశ్ తారక్, సుధాకర్, డిష్ రామలింగం, జనసేన మండల నాయకుడు సురేష్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని హామీలు గుప్పించిన సీఎం జగన్ 6100 పోస్టులకే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ప్రకటించడం దారుణమని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి విమర్శించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 50,892 ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను గుర్తించిందని, కాగా ముఖ్యమంత్రి 6100 పోస్టులతో డీఎస్సీ ప్రకటించి చేతులు దులుపుకుంటున్నారని దుయ్యబట్టారు. జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నాలుగేన్నరేళ్ళు గడిచినా అతీగతి లేదని కల్లబొల్లి మాటలు చెప్పి నిరుద్యోగులను వంచించేందుకే మరో డ్రామా తెరపైకి తీసుకు వచ్చారని విమర్శించారు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగులు 11 శాతం ఉంటే రాష్ట్రంలో 24 శాతంగా ఉందన్నారు. టీడీపీ పాలనలో ఏపీ పెట్టుబడుల్లో నెంబర్ వన్‌గా ఉంటే ఇప్పుడు వైసీపీ పాలనలో గంజాయి రవాణాలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని విమర్శించారు. ముఖ్యమంత్రి సభ కోసం ఇంటర్ పరీక్షను వాయిదా వేయడం, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం కాదా? అని నిలదీశారు. ఈ అరాచక పాలనకు అంతిమ ఘడియలు సమీపించాయని, ప్రజలు రాబోయే కాలంలో స్పష్టమైన తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.


బండిఆత్మకూరులో మాట్లాడుతున్న బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

టీడీపీలో చేరిక


ఫరూక్ సమక్షంలో టీడీపీలో చేరిన యువత

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 4: టీడీపీ నంద్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూఖ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వార్డులకు చెందిన వైసీపీ నాయకులు ఆదివారం టీడీపీలో చేరారు. పట్టణంలోని ఖలీల్ థియేటర్ ఆవరణలోని టీడీపీ కార్యాలయంలో వివిధ వార్డుల నుంచి నబీరసూల్, ఖాజా, కుమార్, మురళీ, మాబు, తదితర ముఖ్య నాయకులు, అలాగే 9వ వార్డు గుడిపాటిగడ్డకు చెందిన యువత వాల్మీకి సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు బోయ రామకృష్ణ, వార్డు టీడీపీ నాయకులు గాజుల శ్రీనివాసులు, మిడత మురళీ, రవి, పురుషోత్తం, నాగరాజు, తదితరుల ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరిని పార్టీలోనికి ఆహ్వానించిన అనంతరం ఫరూఖ్ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా, టీడీపీ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టితేనే ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉన్న ఏపీ పరిస్థితి గాడిలో పడుతుందని అన్నారు. వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేసి, సైకో పాలన చేస్తున్న జగన్‌ను బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

పీరుసాహెబ్ పేట వైసీపీ నాయకులు..


మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 4: టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో అల్లూరులోని ఆయన స్వగృహంలో మిడుతూరు మండలం పీర్‌సాహెబ్ పేటకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు, మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుండం రమణారెడ్డి, రెడ్డివారి సోమ సుందరెడ్డి, పుల్లారెడ్డి, మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు రామేశ్వరెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, శేఖర్, వెంకటేశ్వర్లు, ధనుంజయరెడ్డి, రాజేశ్వరెడ్డి, వెంకటరాజు, లక్ష్మయ్య, శివరాజు తదితరులు టీడీపీలో చేరారు. వీరికి మాండ్ర శివానందరెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 4: తెంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా రెండు బైకులపై తెస్తున్న 75 మద్యం బాటిళ్లను అల్లూరు గ్రామ బ్రిడ్జి వద్ద పట్టుకున్నట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ నాగార్జున తెలిపారు. ఆదివారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామం బ్రిడ్జి వద్ద తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా తెస్తున్న 75 మద్యం బాటిళ్లను రెండు బైకులపై తీసుకుని వస్తుండగా పట్టుకున్నట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ నాగార్జున తెలిపారు. ఈ దాడులను నందికొట్కూరు రూరల్ సీఐ విజయ్ భాస్కర్ పర్యవేక్షణలో తమ సిబ్బందితో కలిసి చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో ఇద్దరు వ్యక్తులు వడ్డె రంగన్న, ఈడిగ శివకుమార్ గౌడును అరెస్టు చేశామన్నారు. రెండు బైకులను కూడా సీజ్ చేసినట్లు తెలిపారు.

'ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం'

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 4: ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగిస్తున్నామని సీపీఎం జిల్లా నాయకుడు నాగేశ్వరారావు అన్నారు. నందికొట్కూరు మండలంలోని బిజీవేముల గ్రామంలో ఆదివారం పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో మండల నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, లక్ష్మేశ్వరగౌడు, తదితరలు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 4: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 5న కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ కె. శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకంతా జిల్లా అధికారులందరూ హాజరు కావాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పోలీస్ స్పందన తాత్కాలిక రద్దు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 4: నంద్యాలలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే పోలీస్ స్పందన కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లల్లో, సీఐ, డీఎస్పీ కార్యాలయాల్లో పోలీస్ స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు గమనించాలని ఎస్పీ తెలిపారు.

'చట్టాలపై అవగాహన ఉండాలి'


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 4: ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండి చైతన్యవంతులైనప్పుడే వ్యవస్థల్లో మార్పులు వస్తాయని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆకుమళ్ళ రహీం అన్నారు. ఆదివారం నంద్యాలలో జిల్లా నూతన కార్యవర్గ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా శాఖ అధ్యక్షురాలిగా సి.ప్రసన్నకుమారి, ప్రధాన కార్యదర్శిగా సత్య నారాయణ గుప్త, కోశాధికారి రహంతుల్లాతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ప్రతినిదులు పలువురు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. క్యూరింగ్ మరిచారు


నెహ్రూనగర్ ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు క్యూరింగ్ చేయని దృశ్యం

పగిడ్యాల, ఫిబ్రవరి 4: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలోని అంజనేయ స్వామి దేవాలయం సమీపంలో రూ.12 లక్షల జీజీఎంపీ నిధులతో 270 మీటర్ల మేర సీసీ నిర్మాణం పనులు చేపట్టారు. అయితే రోడ్డు నిర్మాణం పనులు చేపట్టి వారం రోజులు కావస్తున్నా రోడ్డుకు క్యూరింగ్ చేపట్టకపోవడంతో రోడ్డు నిర్మాణం చేపట్టిన ఫలితం లేకుండా పోతుందని పలువురు ఆరోపిస్తున్నారు. నిర్మించిన సీసీ రోడ్డు పై క్యూరింగ్ చేసేందుకు మట్టిని వదిలిన కట్టలు ఏర్పాటు చేయకుండా వాహనాలు నడపడంతో రోడ్డు దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రజలు అంటున్నారు. సంబంధింతాధికారులు చర్యలు తీసుకొని సీసీ రోడ్డుకు క్యూరింగ్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ ఓటమి ఖాయం: మాండ్ర

నందికొట్కూరు ఫిబ్రవరి 4: వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం, సీఎం జగన్ ఇంటికి వెళ్లడం ఖాయమని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. ముందుగా నందికొట్కూరు పట్టణ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని కొత్త బస్టాండు నుంచి ర్యాలీగా బయలుదేరి బ్రహ్మంగారి మఠానికి చేరుకున్నారు. నందికొట్కూరు పట్టణంలో జయహో బీసీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాండ్ర శివానందరెడ్డి హాజరై మాట్లాడారు. జగన్ సిద్ధం అంటూ పోస్టర్లు కనిపిస్తున్నాయని... అయితే ప్రజలు ఆయనను 2024 ఎన్నికలలో ఓడించి జైలుకు పంపేందుకు సంసిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఎక్కడా ఒక్క సాగునీటి ప్రాజెక్టు కాని, రోడ్డు నిర్మాణానికి తట్టెడు మట్టికాని వేసిన పాపాన పోలేదన్నారు. ఆయనకు కమీషన్ వస్తుందనుకున్న పనులు మాత్రమే చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రైతులకు వ్యవసాయ మోటార్లకు బిగించే మీటర్లపై కేంద్రం ఇచ్చిన రూ.5 వేల కోట్లను తినేందుకు తనకు భాగం ఉన్న సంస్థకు అప్పనంగా అప్పగించారని ఆరోపించారు. రూ.3 వేలు ఖర్చు అయ్యే మీటరును రాష్ట్ర ప్రభుత్వం రూ.36 వేలకు కొనుగోలు చేస్తోందని ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి వెన్నెముక లాంటి బీసీల వెన్ను విరుస్తున్నారన్నారు. పేరుకే 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేశారని, కనీసం వారికి కుర్చీ లేకుండా చేశారని మండిపడ్డారు. బీసీలను చైర్‌లెస్ చైర్మన్లుగా చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో 74 మంది బీసీ నాయకులు హతమయ్యారన్నారు. మరెందరిపైనో కేసులు నమోదు చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2019 ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ఫోన్‌ద్వారా వినిపించి... ఇందులో ఏ ఒక్క హామీనైనా నెరవేర్చారా అంటూ మాండ్ర ప్రజలను ప్రశ్నించారు. మద్యపాన నిషేదం చేయకపోతే 2024లో ఓటు అగనని చెప్పిన జగన్ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఓటు అడుగుతారని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, పార్టీ జూపాడుబంగ్లా మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్, నందికొట్కూరు రూరల్ మండల కన్వీనర్ ఓబులోరెడ్డి, తెలుగు యువత జిల్లా నాయకుడు మహేష్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, టీడీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.


అభివాదం తెలుపుతున్న మాండ్ర తదితరులు

హామీలను విస్మరించిన సీఎం: ఎస్టీయూ


మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 4: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను విస్మరించారని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న ఆరోపించారు. నంద్యాలలోని నేషనల్ పీజీ కళాశాలలో ఆదివారం ఎస్టీయూ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. తిమ్మన్న మాట్లాడుతూ ఎన్నికల ముందు అధికారం కోసం ఎన్నో హామీలను గుప్పించి జాతీయ విద్యా విధానం పేరుతో అశాస్త్రీయ మైన విధానాలను విద్యావ్యవస్థలో ప్రవేశపెట్టి సర్వనాశం చేశారని, 117 జీవో ప్రాథమిక విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావా ల్సిన ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలని, లేని పక్షంలో వచ్చే ఎన్ని కల్లో జగన్‌మోహన్‌రెడ్డికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

పంపు సెట్ల పంపిణీ

ఆత్మకూరు, ఫిబ్రవరి 4: మండలంలోని కృష్ణాపురం, ఇందిరేశ్వరం గ్రామాలకు సంబంధించిన ఐదుగురు రైతులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైఎస్ఆర్ ఉచిత జలకళ పంపు సెట్లను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పంపిణీ చేశారు. జడ్పీటీసీ శంకరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బాలస్వామియాదవ్, సింగిల్ విండో చైర్మన్ సురేష్, వైసీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వాటర్ ట్యాంకు కూల్చివేత



పాణ్యంలోని బీసీ కాలనీలో ట్యాంకును కూల్చివేస్తున్న దృశ్యం

పాణ్యం, ఫిబ్రవరి 4: పాణ్యం బీసీ కాలనీలోని వాటర్ ట్యాంకు ఆదివారం కూల్చివేశారు. ట్యాంకు కూల్చివేతతో స్థానికులు కూల్చివేసిన వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీకి చెందిన ఈ స్థలంలో ఇరవై ఏళ్ల క్రితం పంచాయతీ అధికారులు వాటర్ ట్యాంకును నిర్మించారు. కాగా ఇదే స్థలం ప్లాటులో మరొకరికి కొంత స్థలం కేటాయించారు. ట్యాంకు నీరు తమ ఇంటిలోకి వెళ్తుండడంతో పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో పాటు శిథిలావస్థకు చేరిన వాటర్‌ట్యాంకును తొలగించినట్లు ఇంటి యజమానులు పేర్కొన్నారు. ఘర్షణ వాతావరణం ఏర్పడింది. స్థానికులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు తొలగించిన వాటర్ ట్యాంకు స్థలంలో కొళాయిలు ఏర్పాటు చేయాలని ఇంటి యజమానిని ఆదేశించారు. దీంతో సమస్య సద్దుమణిగింది. పంచాయతీ కార్యదర్శి బాలాంజనేయులును వివరణ కోరగా తాము తొలగించడానికి అనుమతులు ఇవ్వలేదని, స్థానికులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

'రైతాంగాన్ని మోసగించిన కేంద్రం'


బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 4: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2024-2025 బడ్జెట్ కేటాయింపుల్లో రైతాంగాన్ని మోసం చేసిందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు విమర్శించారు. ఆదివారం రైతులకు చేసిన అన్యాయాన్ని నిరసిస్తూ గాంధీచౌక్ సెంటర్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ అంకెల గారడీ అని ధ్వజమెత్తారు. నాయకులు నరసింహులు, సుధాకర్, వెంకటలింగం పాల్గొన్నారు.

'అన్నదాతలకు అన్యాయం'


కురుకుందలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 4: కేంద్ర బడ్జెట్‌లో అన్నదాతలకు అన్యాయం జరిగిందని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు మాబాషా అన్నారు. ఆదివారం ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కురుకుంద గ్రామంలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసనను వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి 1.27 లక్షల కోట్లు మాత్రమే కేటాయించిందని, గత ఐదు సంవత్సరాల బడ్జెట్‌ను పరిశీలిస్తే వ్యవసాయ అనుబంధ రంగాలకు కోత విధిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు సలీం బాషా, హరి కృష్ణ, నాయుని గారి శ్రీనివాసులు, తెలుగు అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఉంగరం అప్పగింత

మహానంది, ఫిబ్రవరి 4: మహానంది క్షేత్రానికి దర్శనం కోసం వచ్చిన చాగలమర్రికి చెందిన శ్రీనివాసశర్మ ప్రాంగణంలోని కోనేరులో పుణ్య స్నానాలు చేస్తున్న సమయంలో పొరపాటున బంగారు ఉంగరం పడిపోయింది. విషయాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ రంగన్న దృష్టికి భక్తుడు తీసుకొచ్చారు. స్థానిక చెంచు యువకులతో కోనేరులో అన్వేషింప చేసారు. దొరికిన బంగారు ఉంగరంను బాధిత భక్తునికి ఆదివారం ప్రధాన ఆలయం పరిసరాల్లో హోంగార్డు ఎం.బాలుడు ద్వారా టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భక్తునికి బంగారు ఉంగరాన్ని అప్పగించారు.

మహానందికి పోటెత్తిన భక్తులు


కోనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు

మహానంది, ఫిబ్రవరి 4: మహానంది క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు శనివారం రాత్రికే తరలి వచ్చారు. తెల్లవారుజామున 5 గంటల నుండే ఆలయం ప్రాంగణంలోని కోనేర్లలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పరమశివుని దర్శనం కోసం గంటల కొద్దీ క్యూలో నిల్చొని దర్శించుకున్నారు. ఆలయం పరిసరాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ. లక్షలాది ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.


దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, ఫిబ్రవరి 4: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఫిబ్రవరి 4: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం కృష్ణా జిల్లాకు చెందిన బాల త్రిపుర సుందరి నృత్య కళానిలయం, సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ బృందంచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. మూషికవాహనం, శివతాండవం, నమశ్శివాయతే, శివపంచాక్షరీ తదిత గీతాలకు సంస్కృతిశర్మ, వెంకటలక్ష్మీ, మనుశ్రీ, జాగృతి, జ్యోత్స్న, కృష్ణవేణి తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 4: మండలంలోని ఎ.కోడూరు లక్ష్మీ చెన్నకేశవ, పార్నపల్లెలోని వీరభద్రస్వామి ఆలయాల నూతన ధర్మకర్తల పాలక మండలికి దరఖాస్తులు చేసుకోవాలని ఆలయాల ఈవో నాగప్రసాద్ తెలిపారు. ఆదివారం ఈవో మాట్లాడుతూ జిల్లా దేవదాయ శాఖాధికారి నోటిఫికేషన్ విడుదల చేశారని, ఆసక్తి గల ఆయా గ్రామాల ప్రజలు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఇందుకు 30 ఏళ్ల వయస్సు పైబడిన వారు అర్హులని, ఇందుకు ఏడుగురు దరఖాస్తు చేసుకోవాలని, తమ దరఖాస్తులను నంద్యాలలోని రైతునగరంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని ఈవో తెలిపారు.

'అష్టదిగ్గజ మహాకవి పింగళి సూరన' పుస్తకావిష్కరణ


పింగళి సూరన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 4: నంది రైతు సమాఖ్య, మాతృభాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వివేకానంద ఆడిటోరియంలో అష్టదిగ్గజ కవి పింగళి సూరన పుస్తకాన్ని ఆదివారం అతిథుల చేతులమీదుగా ఆవిష్కరించారు. శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన అష్టదిగ్గజ కవి పింగళి సూరన నంద్యాల ప్రాంతానికి చెందిన సాహితీ దిగ్గజం కావడం ఈ ప్రాంతవాసుల అదృష్టమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. సాహిత్య పరంగా రాయలసీమకు ఘనమైన చరిత్ర ఉందని వేమన, అన్నమయ్య, పోతులూరి వీరబ్రహ్మం వంటి కవుల రచనలు తెలుగు సాహిత్యానికి వెలుగును ప్రసాదించాయన్నారు. ముందుగా తెలుగుతల్లి, పింగళిసూరన, కీ.శే గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి చిత్రపటాలకు అతిథులు పూలమాల వేశారు. దండెబోయిన పార్వతీదేవి పుస్తక సమీక్ష చేశారు. అంతర్జాతీయ శాస్త్రవేత్త డా.రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, డాక్టర్ ఉదయ శంకర్, డాక్టర్ హయగ్రీవాచార్యులు, మాజీ మున్సిల్‌చైర్మన్లు దేశం సలోచన, కైపరాముడు, ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, సుబ్బారెడ్డి, పుస్తక సంకలన కర్త జెయస్ఆర్‌కె శర్మ, సూసాసం అధ్యక్షుడు డాక్టర్ గెలివి సహదేవుడు, అన్నెం శ్రీనివాసరెడ్డి, రచయతలు డా. కిషోర్‌కుమార్, రైతు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మహా పుష్ప యాగం


హారతి ఇస్తున్న అర్చకులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 4: నంద్యాల వాసవీ దీక్షామండలి ఆధ్వర్యంలో ఆదివారం వాసవీమాతకు అంగరంగ వైభవంగా పుష్పయాగ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 102 మంది మహిళలతో చెరువుకట్ట నుంచి జలాన్ని ఊరేగింపుగా అమ్మవారి శాలకు తీసుకొని వచ్చి అభిషేకం, అనంతరం వివిధ రకాలైన ఫల, పుష్ప, సుగంధ ద్రవాలు, పంచామృతములచే అభిషేకం చేశారు. అమ్మవారిని వివిధ రకాలైన పుష్పాలచేత విశేష అలంకారం చేశారు. సాయంకాలం అమ్మవారిశాల నుంచి గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం, దీపోత్సవం, కోలాటము, కేరళ వాయిద్యాలచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో యినుగూరి రమేష్ బాబు, సంపత్‌కుమార్, మంచికంటి శ్రీరాములు, అంజనీకుమార్, పోలా అనిల్, రాజు,వెంకటేష్, ప్రింటర్ క్రిష్ణ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కోసం పడిగాపులు

● సర్వర్ డౌన్‌తో లబ్ధిదారుల అవస్థలు


గడివేముల సచివాలయం వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

గడివేముల, ఫిబ్రవరి 4: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జాప్యం అవుతోంది. లబ్ధిదారులు పనులు మానుకొని ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సచివాలయం వద్దనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో 1,503 మందికి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. ఫిబ్రవరి 3 నుంచి సచివాలయంలో ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు బయోమెట్రిక్ ఆధారంగా రిజిస్ట్రేషన్‌లను చేస్తున్నారు. సర్వర్ సమస్యలు తలెత్తుతుండటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందకోడిగా సాగుతోంది. మొదటి రోజు 120 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయగా రెండో రోజు 340 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ కోసం సచివాలయాల వద్ద గంటల కొద్ది నిరీక్షించాల్సి రావడంతో లబ్ధిదారులు పెదవి విరిస్తున్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 4: బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన 50 మంది యువకులు ఆదివారం తెలుగుదేశం పార్టీ లో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు యువకులు తెలిపారు. రాష్ట్రం బాగు పడాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని భావించి పార్టీ లోకి చేరినట్లు వారు తెలిపారు. బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయేది తెలుగుదేశం పార్టీ అని యువకులకు ఉద్యోగ, ఉపాధి కల్పించడానికి పార్టీ కట్టుబడి ఉందన్నారు. పార్టీలో చేరిన యువకులకు అండగా ఉంటామని బీసీ తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బనగానపల్లె, ఫిబ్రవరి 4: పట్టణంలోని కంకరగుర్రెడ్డి కళాశాలలో స్వామి వివేకానందుని జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని విశ్రాంతి ఉపాధ్యాయుడు జీ.సుధాకర్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. వివేకానందుడి జీవితం, యువతకు సందేశం అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు రిటైర్డు ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఓబుళరెడ్డి, శ్రీరాములు, హరినాథ్‌గౌడ్, శివన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి: ఆర్డీవో



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లికార్జునరెడ్డి

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 4: ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని ఆర్డీవో మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. ఆదివారం మాయలూరు సచివాలయంలో రిజిస్ట్రేషన్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. మండలంలో 588 పట్టాలు పంపిణీ చేస్తే ఇప్పటి వరకు కేవలం 80 పట్టాలు మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఈ నెల చివరిలోపు పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం కొండుపల్లె, ఇంజేడు, అల్లూరు గ్రామ సచివాలయాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల సబ్‌రిజిస్టర్ సర్వేస్‌నాథ్, డిప్యూటీ తహసీల్దారు తులసీకృష్ణ, వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు: సీఐ



మాట్లాడుతున్న సీఐ సుధాకర్‌రెడ్డి

ప్యాపిలి, ఫిబ్రవరి 4: ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో సీఐ పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇరు పార్టీల వారు ఎటువంటి గొడవలకు దిగకూడదన్నారు. సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకరావాలన్నారు. పోలీసుల నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జలదుర్గం ఎస్‌ఐ విజయ్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా నాగభూషణం

సంజామల, ఫిబ్రవరి 4: సంజామల మండలం తహసీల్దారు నాగభూషణంను నియ మిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లా పెద్దవడగూరు తహసీ ల్దారుగా పనిచేస్తున్న నాగభూషణంను సంజామల తహసీల్దారుగా నియమించారు. ఇక్కడ పని చేస్తున్న మల్లికార్జునరావును చిత్తూరు జిల్లా విజయపురానికి బదిలీ చేశారు.

సారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల, ఫిబ్రవరి 4: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన బోయ గుడిసె రంగమ్మ అనే సారా విక్రేతను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన బోయ గుడిసె రంగమ్మ రంగాపురం రైల్వేస్టేషన్ సమీపంలో నాటుసారా విక్ర యిస్తుండగా.. ఆమెను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని, ఆమెను డోన్ కోర్టులో హాజరు పరిచినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

రుద్రవరం, ఫిబ్రవరి 4: రాక్షస పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. రుద్రవరంలో ఆదివారం 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫ్యాక్షన్ గడ్డపై ప్యాకేజీ ఫ్యామిలీ అన్న వార్త ఆంధ్రజ్యోతిలో రాస్తే ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి ఉలిక్కిపడి ప్రెస్‌మీట్ పెట్టి చెప్పడంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తలలు బాదుకుంటున్నారన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఆ సమస్యల పరిష్కారానికి ఏమైనా సమీక్షలు పెట్టి పరిష్కరించారా? అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఎస్సీలపై దాడులు చేయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఎస్సీడ్రైవరును చంపి డెడ్‌బాడీని డోర్‌డెలివరీ చేసిన ఎమ్మెల్సీనే సభావేదికల్లో సీఎం పక్కన కూర్చోబెట్టుకోవడం విచారకరమన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చారన్నారు. ఐదేళ్లలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయకుండా, ఇళ్లు కట్టించకుండా కాలయాపన చేశారన్నారు. సొంత చెల్లెలినే తిట్టించడం సీఎం జగన్ రాక్షస పాలనకు నిదర్శనమన్నారు. వైసీపీ పాలనలో మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలను వైసీపీ మోసం చేసిందని అన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, మద్యం విక్రయాలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో రంగనాయకులు, పోలా గురుమూర్తి, కొమ్మలపాటి రాజారావు, మాజీ సర్పంచ్ యర్రం ప్రతాప్‌రెడ్డి, రెక్కల మనోహర్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి, మాజీ ఎంపీటీసీ బలరామిరెడ్డి, అల్లాడి చంద్రశేఖర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

నేడు 'జయహో బీసీ సదస్సు'

రుద్రవరంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం నిర్వహిస్తున్న బీసీ జయహో సదస్సు విజయవంతం చేయాలని తాలుకా బీసీ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ఆదివారం పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి బీసీ సోదరులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సదస్సు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అధ్యక్షతన కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఫక్కీరయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవుకులో: టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అవుకులో జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు దంతెల రమణ, వెంకటరమణనాయక్, తిక్కన్న తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి హాజరవుతారన్నారు.

ఘనంగా ఆది అల్లూరి ఎరుకలి స్వామి ఆరాధన

దొర్నిపాడు, ఫిబ్రవరి 4: మండలంలోని దొర్నిపాడు గ్రామంలో వెలసిన ఆది అల్లూరి ఎరుకలిస్వామి ఆరాధన మహోత్సవాన్ని కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయాన్నే ప్రాతఃకాల పూజ, భగవద్గీత పారాయణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కళాకారులు, చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. తరలివచ్చిన భక్తులకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

భజన పోటీలు ప్రారంభం: మండలంలోని ఆది అల్లూరి ఎరుకలిస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భజన పోటీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పోటీలో వివిధ గ్రామాల నుంచి భజన సంఘాలు పాల్గొన్నాయి. విజేతలకు మొదటి మూడు బహుమతులు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు అందజేశారు. నాలుగు నుంచి పదకొండు బహుమతులు వరుసగా రూ.10 వేలు, రూ.9 వేలు, రూ.6 వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ.1,500 అందజేశారు.

ఎరుకలిస్వామికి విఖ్యాతరెడ్డి పూజలు: మండలంలోని దొర్నిపాడు గ్రామంలో వెలసిన ఆది అల్లూరి ఎరుకలిస్వామి ఆరాదన మహోత్సవాల్లో భాగంగా ఆదివారం టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డికి ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. అనంతరం కమిటీ సభ్యులు భూమా జగత్ విఖ్యాతరెడ్డికి శాలువ, పూలమాలలతో సన్మానించారు.



కోలాటం ఆడుతున్న చిన్నారులు

వైసీపీ పాలనలో స్మగ్లింగ్: సుబ్బారెడ్డి

డోన్, ఫిబ్రవరి 4: వైసీపీ పాలనలో అంతా స్మగ్లింగ్ నడుస్తోందని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలో రాష్ట్రం పెట్టుబడుల ఆకర్షణలలో మొదటి స్థానం ఉంటే.. జగన్ రెడ్డి పాలనలో గంజాయి, అక్రమ మద్యం, భూ మాఫియా, ఇసుక మాఫియాలు ముందు వరుసలో ఉన్నాయన్నారు. విచ్చలవిడిగా గంజాయి అమ్ముతుండటంతో యువత జీవితాలు నాశనమవుతున్నాయని అన్నారు. గత ఎన్నికల ముందు మెగా డీఎస్సీ రిలీజ్ విడుదల చేస్తానని మాట ఇచ్చి నిరుద్యోగులను వంచించి మోసగించాడని మండిపడ్డారు.

జీతాలు ఇవ్వలేని ప్రభుత్వం



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

డోన్, ఫిబ్రవరి 4: వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి వెళ్లిందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, డోన్ నియోజకవర్గ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 22వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. సీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రజల్ని, రాష్ట్ర సంపదను వైసీపీ దోచుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిన ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిని వైసీపీ పాలనలోనే చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, ఉడుములపాడు నాగేంద్ర, నీలం ప్రభాకర్, దస్తగిరి, షేక్షావలి, గంధం చరణ్, మద్దయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జగన్‌కు ఓటమి తప్పదు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 4: సీఎం జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాట తప్పినందుకు ఓటమి తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామక్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం కోవెలకుంట్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పక్షంలో ఉన్నప్పుడు జగన్ ప్రజా సంకల్ప యాత్ర చేపట్టారన్నారు. పాదయాత్రలో ఒక్క చాన్సు అంటు అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజలను వేధిస్తున్నాడన్నారు. అర్హులైన వారికి పథకాలు లేకుండా రద్దు చేశారని, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని అన్నారు. విద్యుత్, బస్సు చార్జీలు పెంచి ప్రజలనడ్డి విరిచార న్నారు. మద్యపాన నిషేధం చేస్తానని హామీ ఇచ్చి ఊరూర బెల్టు షాపులు పెట్టారన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు



పూజలు చేస్తున్న ప్రజలు

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 4: ఆళ్లగడ్డలో అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆదివారం పూజలందుకున్నారు. పట్టణంలోని అమ్మవారిశాల, రెడ్డిగారి రామసుబ్బారెడ్డి, రాచం సుబ్బయ్య, భజంత్రి నరసింహులు, సోముల కొండారెడ్డి, సంటెన్న, నడిపెన్న ఇళ్ల వద్ద గల తెలుపుల వద్ద పల్లకీ విడిది చేసింది. దీంతో ఆయా ప్రాంతాలలోని ప్రజలు పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

అహోబిలంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ పూజలు



దిగువ అహోబిలంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 4: అహోబిలం లక్ష్మీనరసింహస్వామిని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) వీఎస్ బాబు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆదివారం ఆయన రాకను పురస్కరించుకొని అహోబిలం ప్రత్యేక అధికారం శివప్రసాదరావు సాదరంగా ఆహ్వానించారు. ఆయన ఎగువ, దిగువ అహోబిలాల్లోని నరసింహస్వాములను దర్శించుకొని పూజలు చేశారు. ఆయన వెంట నంద్యాల ఏపీఎస్పీడీసీఎల్ ఏడీఈ రవికాంత్ చౌదరి ఉన్నారు.

'తహసీల్దార్ హత్య దారుణం'



మాట్లాడుతున్న గుత్తి నరసింహులు

చాగలమర్రి, ఫిబ్రవరి 4: విశాఖపట్నం రూరల్ తహసీల్దార్ రమణయ్య హత్య దారుణమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలు, దాడులు, అక్రమ కేసులు అధికమయ్యాయని ఆరోపించారు. హత్యకు కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ అరాచక పాలనకు రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సయ్యద్ బషీర్, నారాయణరెడ్డి, అస్రఫ్, ఖాజా పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 4: మండలంలోని చిన్నకంబలూరు, రుద్రవరం, కొండమాయపల్లె, యల్లావత్తుల గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు పూజలు చేశారు. బోనాలు, చీరలు సమర్పించి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

లింగమయ్య స్వామికి..

మండలంలోని ముత్తలూరు సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

పూట్టాలమ్మకు..

ఆళ్లగడ్డ: మండలంలోని ఆర్‌క్రిష్ణాపురంలో వెలసిన పుట్టాలమ్మకు ఆదివారం భక్తులు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేసి, కానుకలు సమర్పించుకున్నారు. భక్తులకు వేదపండితులు అన్నదానం చేశారు.

వైభవంగా గంగమ్మ దీపోత్సవం

చాగలమర్రి, ఫిబ్రవరి 4: చాగలమర్రి గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో గల గంగమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి మహిళలు సామూహికంగా 108 దీపాలు వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ గంగమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు బ్రేక్

చాగలమర్రి, ఫిబ్రవరి 4: సర్వర్ సమస్యతో ఆదివారం చాగలమర్రి మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు బ్రేక్ పడింది. ముత్యాలపాడు గ్రామంలోని సచివాలయం వద్ద రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన మహిళా లబ్ధిదారులు కార్యాలయం ముందు నిరీక్షించారు. 11 గంటల నుంచి సర్వర్ పని చేయకపోవడంతో రిజిస్ట్రేషన్ నమోదు నిలిచి పోయింది. సంబంధిత అధికారులు, ఆపరేటర్లు, వీఆర్వోలు కార్యాలయాల్లో ఉండిపోయారు. లబ్ధిదారులు పనులు వదులుకొని సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. డీటీ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా సర్వర్ సమస్య వాస్తవమేనని, ఉదయం కొద్దిసేపు మాత్రమే పని చేయడంతో రిజిస్ట్రేషన్ చేశామని అన్నారు. మధ్యాహ్నం వరకు సరిగా పని చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారన్నారు. 160 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేశామని అన్నారు.



ముత్యాలపాడు సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న మహిళలు

'టీడీపీతోనే బీసీల సంక్షేమం'



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణగౌడ్

చాగలమర్రి, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో బీసీ సబ్ ప్లాన్ కింద దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చు చేశారని గుర్తుచేశారు. బీసీ కుల వృత్తుల వారికి పనిముట్లను అందజేసి ప్రోత్సహించారన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చి నిరుద్యోగ యువతను ఆదుకున్నారన్నారు. సీఎం జగన్ బీసీలకు ఎలాంటి అధికారులు లేకుండా ఆర్థిక ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. నిధులు లేని బీసీ కార్పొరేషన్‌లతో నిరుద్యోగ యువతకు ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని అన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, సిద్ధప్ప, లాలయ్య, చిన్నికృష్ణయ్య పాల్గొన్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి: సీపీఐ



దొరపల్లిలో పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న సీపీఐ నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 4: ప్యాపిలి, డోన్ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని దొరపల్లె గ్రామంలో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన రంగనాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్యాపిలి, డోన్ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడంలో తీవ్ర ఆలస్యం జరుగుతోందని అన్నారు. దీంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుంకయ్య, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు వరదరాజులు, నారాయణ, విజయుడు పాల్గొన్నారు.

నేత్ర దానం

బేతంచెర్ల, ఫిబ్రవరి 4: పట్టణంలోని బైటిపేటకు చెందిన రాములమ్మ (81) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. తమ తల్లి నేత్రాలు మట్టిపాలు కాకుండా ఇద్దరి అంధులకు చూపు ఇచ్చేందుకు ఆమె కుమారులు శంకరయ్య రంగస్వామి లైఫ్ యువ నేత్ర సభ్యులకు నేత్రదానం చేశారు. నంద్యాల డా. శ్రీకాంత్ వెంటనే స్పందించి కుటుంబ సభ్యుల సమక్షంలో మృతురాలి నేత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో మృతురాలి కుటుంబ సభ్యులు, లైఫ్ యువ నేత్ర సభ్యులు అక్బర్, శ్రీనివాసులు, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

సివిల్ సప్లై గోడౌన్ తరలింపు

రుద్రవరం, ఫిబ్రవరి 4 : రుద్రవరంలో ఉన్న సివిల్ సప్లై గోడౌన్‌ను ఎర్రగుడిదిన్నె గ్రామ సమీపానికి తరలించినట్లు గోదాము ఇన్‌చార్జి నాగాంజనేయులు ఆదివారం తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి అక్కడికి తలరించినట్లు తెలిపారు. అక్కడి నుంచి శిరివెళ్ల, రుద్రవరం మండలాల్లోని చౌక దుకాణాలకు రేషన్ బియ్యం సరఫరా చేస్తామని తెలిపారు.

వైసీపీకి పతనం తప్పదు



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ

డోన్(రూరల్), ఫిబ్రవరి 4: రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వానికి వచ్చే సాధారణ ఎన్నికల్లో పతనం తప్పదని కాంగ్రెస్ డీసీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి, డోన్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి అన్నారు. ఆదివారం డోన్ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీని గెలిపిస్తే ప్రత్యేక హోదా వస్తుందని కల్లబొల్లి మాటలు చెప్పిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలవుతున్నా.. కూడా ప్రత్యేక హోదా అంశంపై నోరు కూడా మెదపడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలను వైసీపీ ప్రభుత్వం దగా చేస్తున్నదని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు సుబ్బు యాదవ్, వడ్డె రాజశేఖర్, వై.శేఖర్, శివరాముడు, మహేంద్ర, నాగరాజు, మల్లికార్జున, బేతంచెర్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

'నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి'

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 4: ఆళ్లగడ్డ మండలంలోని గ్రామాల్లో రానున్న వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. మండల అధికారులు గ్రామాల్లోని సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రమణారెడ్డి, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'నిరుద్యోగులను దగా చేసిన వైసీపీ'

చాగలమర్రి, ఫిబ్రవరి 4: నిరుద్యోగులకు వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని, ఇచ్చిన హామీ మేరకు దగా డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ కావాలని జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు డెన్ని జాన్సన్, జిల్లా కౌన్సిలర్ మహమ్మద్ గౌస్ డిమాండ్ చేశారు. ఆదివారం చాగలమర్రి యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రస్తుత డీఎస్సీలో అప్రెంటిస్‌షిప్ విధానం పునరుద్ధరించే నిర్ణయం సరికాదని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో అప్రంటిస్‌షిప్ విధానం అమలు చేసే వారని, అయితే పోరాటాల వల్ల ఆ విధానం రద్దు చేశారని గుర్తు చేశారు. అయితే మళ్లీ వైసీపీ ప్రభుత్వం అప్రంటిస్‌షిప్‌ను తెరపైకి తెవడం తగదని అన్నారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు బాలస్వామి, గోపాల్, మన్సూర్, శంకర్, యేసుదాసు, గౌస్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉద్యోగులను మోసం చేసిన జగన్



మాట్లాడుతున్న హెచ్.తిమ్మన్న

బేతంచెర్ల, ఫిబ్రవరి 4: పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశారని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న విమర్శించారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని నేషనల్ పీజీ కాలేజీలో సమావేశాల హాలులో జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఆజాంబేగ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తిమ్మన్న పాల్గొని మాట్లాడుతూ జగన్ సీపీఎస్ రద్దు చేస్తానని, పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తానని ఇచ్చిన హామీలను నెరవే ర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స.గోకారి, మహ్మద్ ఇక్బాల్, ఈవీ గోపాలకృష్ణ, బాలగంగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, యు.సుబ్బరాయుడు, వి.శివశంకర్, జీవీఎస్ ప్రసాద్ రెడ్డి, జి.నాగేంద్ర కుమార్, పి.శివప్రసాద్ పాల్గొన్నారు.